నాలుగుకాళ్ల మండపం

నగరంనుంచీ యింగ్లీషు దినపత్రికల్ని మోసుకొచ్చిన పేపర్‌వాన్ నాలుగు కాళ్ళ మండపం దగ్గరికి రాగానే హారన్ మోగించడం మొదలెట్టింది. అక్కడినుంచీ ఆ పేపరు యేజెంటు కార్యాలయం అరఫర్లాంగు దూరంలో వుంది. ఆ అరఫర్లాంగు దూరం పొడవునా హారన్ మోగిస్తూ వెళ్లడం ఆ వాన్ డ్రైవర్ కలవాటు. నిద్రపోతున్న పేపర్ కుర్రాళ్ళకు అదే మేలుకొలుపు.

నాలుగు కాళ్ళ మండపం దగ్గర, పాత చావడి మొండిగోడల పక్కన పడుకున్న రంగమ్మ పేపరు వాన్ హారను వినిపించగానే, విసుగ్గా వొళ్లు విరుచుకుంటూ లేచి కూర్చుంది. కనురెప్పల్ని విడివడనివ్వకుండా అడ్డం పడుతున్న కంటి పుసుల్ని రెండు చేతుల్తోనూ తుడుచుకుంటూ, సగం కనురెప్పల్ని బలవంతంగా పైకి కదిల్చి రోడ్డుకేసి చూపులు సారించింది.

ఆకాశంనుంచీ నేలకు దిగిన నునులేత మంచు తెరల కవతల, నాలుగు రోడ్ల కూడలిలో తీగలకు వేలాడుతున్న సోడియం వేపర్ లైటు చుట్టూ నాలుగైదు రెక్కల పురుగులు గిరికీలు కొడుతున్నాయి. షట్టర్లు దించిన అంగళ్ల పక్కన, మూరెడు పొడవున్న సిమెంటు చప్టాలపైన కొన్ని మానవ శరీరాలు ముడుక్కుని పడుకుని గురకలు తీస్తున్నాయి.వాళ్ల మధ్య అక్కడొకటీ అక్కడొకటీగా ఆవులు, దూడలు కొన్ని పడుకుని, మోరలు పైకెత్తుకుని, నెమరేసుకుంటూనే జోగుతున్నాయి. యెడమ వైపున్న మురికి కాలువ పక్కన పందిపిల్లలు రెండు బురద మట్టిని కెలుకుతున్నాయి. పాత చావడి గోడ చివర్లో నిలబెట్టిన రిక్షాలో రిక్షావాలా తూగుతున్నాడు.

రంగమ్మ తానంతవరకూ కప్పుకున్న బొంతలోంచీ తన శరీరాన్ని యీవలికి లాగి, తన పక్కన పడుకున్న శాల్తీనోసారి కుదిపి చూసింది. చీకటి రంగు దుప్పటిలో దూరి నిద్రపోతున్న ఆ శరీరం అటూ యిటూ పొర్లింది. వుచ్ఛ్వాస నిశ్వాసాలతో వువ్వెత్తుగా యెగిసిపడుతున్న ఆ శరీరానికి పక్కన, పొత్తిళ్లలో పడుకున్న పసికందు, రొమ్ము నోట కరుచుకుని చీకుతూ నిద్రపోతోంది.

తన కడుపులో పేగులు అరుస్తున్న శబ్దం రంగమ్మకు స్పష్టంగా వినిపిస్తోంది. అరిచేతితో కడుపుపైన రుద్దుకుంటూ "టీ దేగ్సా దయాళింకా రాలేదు. టీ కడుపులో పడితేగానీ వొంట్లోకి త్రాణరాదు" అంటూ గొణుక్కుంది ఆమె.

గంట గణగణలాడించుకుంటూ రిక్షా వొకటి రైల్వే స్టేషను వైపుకు పరుగులు తీస్తోంది. కిరోసిన్ వాసనల్ని విరజిమ్ముతూ ఆటో వొకటి బస్టాండువైపుకు వురకలు పెడుతోంది.

చుట్టూ నిద్రపోతున్న వ్యక్తులందరినీ పరకాయించి చూసింది రంగమ్మ. మందులషాపు షట్టరు పక్కన ముక్కు ముసలాయన నిద్రపోతున్నాడు. అతడెప్పుడొచ్చి పడుకున్నాడో గుర్తు రావడం లేదామెకు. అంటే, రాత్రి మలిజాము గడచిన తర్వాత కాస్సేపు తాను ఆదమరచి నిద్రపోయి వుండొచ్చునన్న విషయం మాత్రం ఆమెకప్పుడు స్ఫురించింది.

మందులషాపు పక్కన, నూనె బంకు ముంగిటిలో, రోడ్డు పైన, దుమ్ములోనే పడుకుని వున్నాడు నామాలాయన. ముక్కు ముసలాయన లాగే నామాలాయన కూడా దాదాపు నెలదినాల నుంచీ అక్కడికే చేరుకుంటున్నాడని రంగమ్మకు తెలుసు.

నూనె బంకు పక్కనున్న ఫోటో స్టుడియో గ్రిల్స్ నానుకుని అయిదారుమంది మగవాళ్లు వరుసగా పడుకుని నిద్రపోతున్నారు. రోడ్డుకటువైపున టీ అంగడి తలుపుల పక్కన మరో అయిదారు శరీరాలు గురకలుపెడుతున్నాయి. కూడలికిటువైపున, చావడి పక్కనున్న అద్దాలంగడి మెట్లపైన బేల్దారి బక్కాయన కుటుంబం నిద్రపోతోంది. రోడ్డుకటువైపున వరుసగా వున్న అంగళ్ల షట్టర్ల పక్కన వొకరి వెంట మరొకరుగా వరుసగా కొంతమంది వ్యక్తులు పడుకుని వున్నారు. కూడలినుంచీ తూర్పువైపుకెళ్లే బండ్ల వీధిలో రెండువైపులా గుంపులు గుంపులుగా కొందరు ముసుగులు కప్పుకుని నిద్రపోతున్నారు. వుత్తరపు దిశకెళ్లే మున్సిపల్ ఆఫీసు రోడ్డుకొకవైపున మురికికాలువ పొంగి ప్రవహిస్తోంది. యింకోవైపున రోడ్డులోకే చొచ్చుకొని వచ్చినట్టున్న హనుమంతుడి గుడి పక్కన, యెవరూ పడుకునే సాహసం చేయలేదు.

రంగమ్మ పడుకున్న చోటునుంచీ బండ్ల వీధి తప్పించి మిగిలిన మూడు వీధులూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాదాపు నిర్మానుష్యంగా వున్న వీధుల్లో చీకటిని లోనికి రానివ్వకుండా కాపలా కాస్తున్న సైనికుల్లా ట్యూబ్‌లైట్లు వెలుగుతున్నాయి.

నిద్రపోతున్న మనుషుల్ని చూస్తే రంగమ్మకు చాలా కోపంగా వుంది. నిన్నటి రాత్రి రెండు పాలితిన్ కవర్లు ఖాళీ చేసి వుంటే, తాను కూడా మిగిలిన వాళ్లలాగే వొళ్లు మరచి నిద్రపోగలిగి వుండేదానినన్న విషయం గుర్తుకురాగానే ఆ కోపం రెండింతలయింది. చీర రొంటిలోని రూపాయి బిళ్ళ తప్పితే మరో పైసా అయినా తన దగ్గర లేదన్న సంగతి జ్ఞాపకం రావడంతో ఆమెకు వొళ్లు మండిపోయింది. తన పక్కన పడుకున్న వ్యక్తిని మరోసారి విసవిసా కుదుపుతూ “యేయ్ రాజీ! తెల్లారిపోయింది. లై... పైకి” అంటూ విసుక్కుంది.

యింతలో పెద్ద బాడీ వున్న లారీ వొకటి కారుబారు చేసుకుంటూ కూడలి మధ్యలోకి వచ్చి నిల్చుంది. లారీలోంచీ నిక్కరు తొడుక్కున్న క్లీనరు కుర్రాడు రోడ్డుపైకి దూకేశాడు. ఫోటో స్టుడియో దగ్గర పడుకున్న గుంపు దగ్గరికెళ్లి అందరినీ లేపి కూర్చోబెట్టాడు. కాస్సేపు వాళ్ల మధ్య సంప్రదింపులు జరిగాయి. తరువాత వాళ్లందరూ లారీ పైకెక్కారు. లారీ పెద్దగా శబ్దం చేస్తూ వెళ్లిపోయింది.

పాత చావడి గోడ పక్కన రిక్షాలోనే పడుకుని తూగుతున్న రిక్షావాలా వులిక్కిపడి నిద్రలేచి, తలకు పాత టవలు చుట్టుకుని రిక్షాను రైల్వేస్టేషను వైపుకు కదిలించాడు.

"వొసే నిద్ర మొగమా, లెయ్యే పైకి... నాలుగుకాళ్ళ మండపం కాడ తెల్లారిజాము బేరాలు మొదులైపోయినాయి...." అంటూ రంగమ్మ రాజీకి సుప్రభాతం పాడింది. రాజీ బలవంతంగా కళ్లు విప్పి, పాపాయి నోట్లోంచీ రొమ్మును వేరు చేసింది. తరువాత దాని బుగ్గమీద పెద్దగా శబ్దం చేస్తూ ముద్దు పెట్టుకొంది. వోసారి చుట్టూ కలియజూసి, బిగ్గరగా ఆవులించి మళ్లీ కళ్లు మూసుకుంది.

రంగమ్మ రొంటిలోంచి చిన్న గుడ్డ సంచీని యీవలికి లాగి చేతినందులోకి జొనిపి, పొగాకు కాడ నొకదాన్ని పైకి తీసింది. పడక పక్కన పెట్టుకున్న చెంబులోని నీళ్లతో నోరు పుక్కిలించి వూసి, పొగాకు కాడను పళ్ల మధ్య యిరికించింది.

దూరంగా రోడ్డుపైన వీధి దీపాల వెలుతుర్లో నీడని జాలువార్చుతూ వో ఆకారం నాలుగుకాళ్ల మండపం కేసి రావడం కనిపించింది. తదేకంగా అటే చూడసాగింది ఆమె. చావడి దగ్గరికొచ్చాక నాలుగురోడ్ల కూడలిలో నిల్చుని చుట్టూ కలయజూశాడతను.

అతడు ముఖం చుట్టూ చుట్టుకున్న నల్లరంగు మప్లరు శరీరపు రంగుతో కలిసిపోయింది. దుబ్బు మీసాలకు అగ్గి తగులుతుందేమోననిపించేలా బీడీ పెదవుల మధ్య రగులుతోంది.

"నువ్వా మునిరాంరెడ్డీ! యీ పొద్దు యెందురు గావాల్న?" అంటూ రంగమ్మ పలకరించింది.

మునిరాంరెడ్డి చావడి కేసి నాలుగడుగులు వేసి, "నీ కంటబడిపొయినానా రంగమ్మత్తా! జుట్టంతా ముగ్గుబుట్ట మాదిరిగా తెల్లబడిపోయినా, నీ కంటి చూపుమాత్రం తగ్గలేదు" అంటూ బిగ్గరగా నవ్వేసి, "యీ పొద్దు చానామంది పన్లేదులే! నలుగురు చాలు. అట్లాంటిట్లాంటోళ్లు లాభం లేదు. సరైన మనుషులు గావాల్ల. నువ్వే చెప్పు. యెవుర్ని లేపమంటావు?" అని ప్రశ్నించాడు.

రంగమ్మ వెనక్కు తిరిగి పొగాకు రసాన్ని చావడి గోడపైన వుమ్మేసి, గొంతు సవరించుకుని "దిట్టమైన మనుషులు గావలిసినోడివి బాగా తెల్లారినాంక రాగూడదా అల్లుడూ! నాకవుతే యీడుండే వాళ్లల్లో తెలిసింది యిద్దురు ముగ్గురే! ఆ ముక్కు ముసలాయనా, నామాలాయినా, బేల్‌దారీ బక్కాయిన కుటుంబరమూ తప్పితే యీడుండే మిగిల్నోల్లందరూ కొత్తోళ్లే గదా! యీ సీకట్లో యెవుడు బలంగావుండాడో, యెవుడు వూనాసోడో యెవుడికి తెలిస్తింది?" అంది.

"ఆ సంగతి చెప్పేదానికేనా వక్కాకు బెట్టి పలకరించినావు?" మునిరాంరెడ్డి విసుగ్గా వెనుదిరగబోయాడు.

"వుండుండు రెడ్డీ! వొక మాట..." రంగమ్మ పైకి లేచి, కూడలిలోకెళ్లి మునిరాంరెడ్డికి దగ్గరగా నిల్చుంది.

బీడీ పీకను దూరంగా విసిరేసి, యేమిటని ప్రశ్నిస్తున్నట్టుగా కళ్లెగరేశాడతను.

"జయలక్ష్మి యెట్లుండాది?" అని అడిగింది ఆమె.

"నువ్వు సరైన పెద్దమనిషేలే రంగమ్మా! భలే గిరాకీని తగిలించినావు. పొమ్మంటే పోకుండా బంకమాదిరి తగులుకొనింది. నూటిరవై యిచ్చేదాంకా నా ప్రాణం తీసేసింది..." చెబుతున్న

ధోరణిని బట్టి అతడు కోపగించుకుంటున్నాడో లేక ఆనందిస్తున్నాడో తేల్చి చెప్పడం కష్టంగా కనిపిస్తోంది.

"అయితే, అదిప్పుడు నీతో లేదా? ఆ మాట చెప్పు ముందు. అది సరేగానీ, పన్లోకి ఆడ కూలోళ్లు వద్దా నీకు? అదో, నా కాడనే వుందొక పిల్ల..."

"చాలు చాల్లే రంగమ్మా! నీతో లావాదేవీలు పెట్టుకునే వోపరికం లేదు నాకు" విసుగ్గా ఆమె మాటలకు అడ్డు తగిలాడు మునిరాంరెడ్డి. "వొకసారి రుచి జూసినాంక గూడా నాకు బుద్ధి రాలేదనుకుంటా వుండావా నువ్వు!, వస్తా తల్లీ! రంగంపేట కాన్నించీ కడగాలరాళ్లు తోలుకోని రమ్మని పెద్దరెడ్డి చెప్పినాడు. పదికంతా రాళ్లతో యింటిముందు కనబడకపోతే అగ్గయిపోతాడు. నా సంగతి నేను చూసుకుంటానుగానీ, నా యెనక బడద్దు. ఆ జయలక్ష్మి వున్నన్నాళ్లూ నా పెండ్లాం నన్ను ఆ పొయిలో పెట్టి, యీ పొయిలో తీసి చంపేసింది. నీ గిరాకీలు నాకొద్దు..."

"వొట్టి బెదురుగొడ్డు మాదిరి మాట్లాడద్దు రెడ్డీ! వొకసారి మనిషెట్లుండాదో సరిగ్గా జూసిపో. మల్లంక నన్ను నిష్టూరం చేస్తే లాభం లేదు" అంటూ రంగమ్మ అతడిని వూరించడానికి ప్రయత్నించింది.

అతను గిరుక్కున వెనుదిరిగి, బండ్లవీధివైపు కెల్లిపోయాడు.

వొకటి రెండు నిమిషాలసేపు ముందుకెల్లి పోతున్న అతడివైపే తదేకంగా చూసి, ఆ తరువాత బిగ్గరగా నిట్టూర్చి వెనుదిరిగింది రంగమ్మ. దుప్పటి కప్పుకుని తనకేమీ పట్టనట్టుగా నిద్రపోతున్న రాజీని చూడగానే ఆమెకు వొళ్లు మండిపోయింది. కోపంతో పళ్లు పటపటలాడించి, "దొంగలంజ... బసివి ముండ..." అని రెండు మూడు తిట్లు ప్రసారం చేసి, విసుగ్గా రాజీకేసి కాలు జాడించింది.

రాజీ వులిక్కిపడి నిద్ర మేలుకొంది. ముఖంపైనుంచీ దుప్పటి తప్పించి బిత్తరచూపులు సారించింది.

"యింత తూగుమూతితో యెట్ల బతికి బట్టగడతావే పెద్దమ్మా! చాలని దానికి తగువుగా వొక బిడ్డను గూడా కనుక్కోని కూచోనుండావే! ఆ బయమైనా లేదు గదా నీకు!" అంటూ రంగమ్మ తన యథాస్థానంలో గొంతుక్కూచుంది.

తానేదో పెద్దపొరబాటే చేసి వుంటానన్న నమ్మకం కలగడంతో రాజీ బిక్కమొహం పెట్టుకుని లేచి కూర్చుంది. పొత్తిళ్లల్లోని బిడ్డపైన గుడ్డను సవరించుతున్నట్టుగా నటిస్తూ రంగమ్మకేసి కొనచూపుల్ని సారించింది.

పొగాకు నవతలికి వుమ్మేసి, రంగమ్మ గొంతు సవరించుకుంది. "నాలుగు దినాలుగా యీడ మనం అగోరిస్తా వుండామని తెలుసు. చేతిలో వున్న దుడ్డు నిన్న మాపిటేలతో అయిపోయిందని తెలుసు. యీ పొద్దు పని దొరక్కపోతే మద్దానం యేం తిందామనుకోనుండావు నువ్వు అని అడగతా వుండాను. ఆ దిగులుంటే నీకు నిద్రెట్లా పడతాది? నీ కోసరమని నేను వచ్చేపొయ్యే వాళ్లనంతా కాపెట్టుకోనుంటే, నువ్వు బెల్లంకొట్టిన రాయి మాదిరిగా నిగడదీసుకోని పడుకుంటే జరిగేదెట్ల! మూతీ గీతీ కడుక్కోని కూచుంటే గదా, యీడొక నపురుండాదని అందురికీ తెలిసేది? నేను

చెప్పినప్పుడే లేచి రెడీగా వుండుంటే మునిరాంరెడ్డి చూసుండును గదా! మునిరాంరెడ్డంటే యెట్లాంటోడో తెలుసునా నీకు? తెలియదు. తెల్లారితే నూటా పదకొండు పనులు జరగుతాయి. వాని చేతుల మీదుగా. యేదో వొకదాన్లో నిన్నిరికించేసుండును. అట్లాంటోన్ని నమ్ముకోనుంటే, నీ బతుకు పచ్చగా జరిగిపొయ్యుండును గదా! మొన్నటికి మొన్న..." మునిరాంరెడ్డీ, జయలక్ష్ముల వుదంతం జ్ఞాపకం రావడంతో రంగమ్మ తన ఉపన్యాసాన్ని ఆపేసింది.

బండ్ల వీధిలోంచీ నలుగురైదుగురు వ్యక్తుల్ని వెంటబెట్టుకుని, వాళ్లముందే నడుస్తూ రైల్వేస్టేషను వైపు కెళ్లిపోయాడు మునిరాంరెడ్డి.

మెడికల్ షాపు ముందు పడుకున్న వాళ్లలోంచీ యిద్దరు నిద్రలేచి బీడీలు వెలిగించు కుంటున్నారు. వాళ్లు మాట్లాడుకోవడం వినిపించి నిద్ర మేలుకున్న మరో యిద్దరు పాత టైరుకు నిప్పంటించి చలి కాచుకుంటూ కూర్చున్నారు. గాంధీ రోడ్డులో మార్కెట్టు దగ్గర మెల్లమెల్లగా సవ్వడి మొదలయింది.

యినప తీగల చట్రంలో బిగించిన టీ డేగిశాను రగులుతున్న కుంపటితో బాటూ వొక చేత పట్టుకుని, మరో చేత్తో నీళ్ల బకెట్టు నెత్తుకుని వొక వ్యక్తి నాలుగు కాళ్ల మండపం దగ్గరికొచ్చేశాడు.

"దయాళన్నా! నీ కోసరమే చూస్తా వుండాను. నా ముఖానో టీ కొట్టు...." అంటూ ఆహ్వానించింది రంగమ్మ.

దయాళ్ టీ సరంజామాను నేలపైన పెట్టి, బకెట్‌లోని నీళ్లతో గాజు గ్లాసును కడుగుతూ, "యీ పొద్దు జనమెందుకో తక్కవగా కనబడతా వుండారు" అంటూ గొణిగాడు.

"యింకా మొబ్బు మొబ్బుగానే వుండాది. తెల్లారీ తెల్లారక ముందే నీ కోసరమని జనాన్నేడనుంచీ తెచ్చి పెట్టేది? యెంత సేపులే! చూస్తా వుండంగానే తెల్లారిపోతాది. యిసికేస్తే రాలనట్లుగా మనుషులుకూడా వచ్చేస్తారు. చిటికేసేంత సేపులో నీటీ అంతా ఖర్చయిపోతాది" టీ గ్లాసు చేతికొచ్చాక మాట్లాడటం ఆపేసి, టీ నీళ్లు చప్పరించసాగింది రంగమ్మ.

దయాళ్ మరో టీ గ్లాసును రాజీవైపుకు చాపాడు.

రంగమ్మకు తన దగ్గర వొకే వొక రూపాయి మిగిలి వుందన్న సంగతీ, రెండు టీ గ్లాసులకూ తానే డబ్బుల్ని చెల్లించాలన్న సమాచారమూ స్ఫురించాయి. అడగకుండానే రాజీకి కూడా టీ యిచ్చిన దయాళ్‌పైన ఆమెకు చెప్పలేనంత కోపం వచ్చింది. కానీ, తన కోపాన్ని వెలిబుచ్చడానికది అదను కాదని మౌనంగా వుండిపోయింది.

యెప్పుడు నిద్రలేచాడో యేమో, నామాలాయన టీ కుంపటి దగ్గరికొచ్చి నేలపైనే గొంతుక్కూచుని, "నాక్కూడా టీ" అంటూ ఆర్డరిచ్చాడు. గువ్వ తొక్కిన కొబ్బరికాయలా పొట్టిగా, పీలగా, వక్రంగా, వింతగా వున్నాడతను. "ఏం రంగమ్మా! రెండు మూడు దినాలుగా చూస్తా వుండాను. యెవురీ కొత్త పిల్ల? చుట్టమా?" అని వాకబు చేశాడు.

"చుట్టమూ గాదు, సొంతమూగాదు. యీ బాసాలి సంగతేమని చెప్పుదునులేన్నా! నాలుగు దినాల ముందు తెలిసినోళ్ల పిల్ల వొకతి తీర్ధమాడితే గవర్మెంటాసుపత్రికి పోయినాన్లే! ఆడ

తగులుకున్న గాచ్చారం యిది. అయినా, వొకర్నని లాబం లేదన్నా! నన్ను నేను చడావుల్తో గొట్టుకోవాల్ల..." ఖాళీ గ్లాసును నేలపైన పెట్టి, చివరి రూపాయిని దయాళ్ చేతిలోకి గిరవాటేసినట్టుగా విసిరికొట్టి, మరోసారి నిట్టూర్చింది రంగమ్మ. "ఆ పిల్లకు కడుపులో బిడ్డ తిరక్కపోయిందని ఆపరేషను చేసినార్లే! చూసుకునేదానికి మనిషి లేదని వాళ్లు అంగలారిస్తే, పోతే పోనీ అని రెండు రాత్రుళ్లు ఆడనే అగోరించినా. వూరికే కాదనుకో. అన్నం బెట్టి దినానికి పదిచ్చినారు. పోయిన బేస్తవారం, సరింగా రెండో ఆట యిడిసిపెట్టే టయిం, గేటుకాడ గలాంబులాం అని గలాటా! యేందబ్బా అని పోయి చూసినా. చేతుల్లో పసికందు నెత్తుకోని యీ పిల్ల వొక మొగ మనిషితో పోరకలాడతా వుంది. వున్నమాట వున్నట్టుగా చెప్పాలగదన్నా! వాడసలు మొగుడు గాదేమోనని నాకు అనుమానం. లేకపోతే అదంత గట్టిగా పట్టక మల్లాడ్సిన పనేముండాది? మొగుడయినోడు యాడికి పోతాడు? గూటానికి కట్టేసిన గొడ్డు మాదిరి తిరిగి తిరిగీ మల్లా తావు చేరకపోతాడా? వాడసలు మొగుడేనా అని అడిగితే, యీ పిల్ల జబాబు చెప్పనంటిందే?"

నామాలాయన రాజీకేసి చూశాడు. రంగమ్మ చెబుతున్న సంగతితో తనకేమీ సంబంధం లేదన్నట్టుగా ఆమె యెటో చూస్తోంది.

"ఆ అర్ధరాత్రి పూట వాచ్‌మేన్‌కు వొకటో రెండో చదివించి, దొంగతనంగా వార్డులో కొచ్చినాడంట వాడు. యెందుకొచ్చినాడో యేమో నాకు తెలియదు. పోతానంటే యిది వదిలిపెడితే గదా! బిన్నాగా బయటికి పొమ్మని వాచ్‌మేనూ, తెల్లారితే మల్లా వస్తానని ప్రమాణాలు చేస్తా వాడూ, చచ్చి గీపెట్టినా వదలననీ, కావాలంటే అప్పటికప్పుడే వానితో వచ్చేస్తానని యిదీ... యెప్పుడు బడితే అప్పుడు బాలింతరాల్ని పంపించేస్తే డాక్టర్లు తంతారని వాచ్‌మేన్నూ... అదీ జగడం... వాచ్‌మేన్ యిట్ల కాదురా అని వాని చెయ్యి పట్టుకోని బరబరా లాక్కుంటా పోయి గేటుకాపక్క తోసేసినాడు. అదే పావాటం. ఆ మొగుడయినోడు మల్లా ముఖం జూపించలేదు. యీ బాసాలి కండ్లలో నీళ్లు పెట్టుకోని ప్రాణాచారం చేస్తా కూచునింది. పోతే పోనీ మనమే వొక దోవ చూపిద్దామని యిట్ల తొడుక్కొచ్చినాను. మూడు దినాలుగా యీడ్నే అంగలారస్తా వుండాము. వృధాగా తిని తిరగలాడతా వుండాం. మన దగ్గిరుండేది దాంచి పెట్టుకుంటే చూసేవాళ్ల కెట్ల తెలస్తాది? ఒళ్లు మినమినా మెరస్తా వుండేటప్పుడు కొంచెం తెలివిగా బతికితే మళ్ల బయపడాల్సిన పని వుండదు. జోరీగ మాదిరి దీని చెవుల్లో గీ పెడతా వుండాను. దీని చెవికెక్కాటం లేదు..."

నామాలాయన ఖాళీచేసిన గ్లాసును చేతికి తీసుకుని, అతడందించిన చిల్లర డబ్బుల్ని భుజానికి వేలాడుతున్న పొడుగు దారాల నీలిరంగు సంచిలో వేసుకుని, టైర్లు కాలుతున్న వైపుకు కదులుతూ వోసారి బిగ్గరగా 'టీయ్' అంటూ కేకేశాడు దయాళ్.

"ఆ మాట నాకు ప్రత్యేకంగా చెప్పాల్నా రంగమ్మా! పుట్టి భూమ్మీద పడినప్పటినుంచీ యీ వూర్లోనే పడి దొర్లాడినోడిని. నువ్విప్పుడు చూస్తా వుండే సిన్మా కొటాయిల కాన్నించీ రైలు టేషనూ, బస్టాండులూ అన్నీ నా కండ్ల ముందర్నే కట్టినారు. అయినా, దినబత్తెం కోసమని యిప్పటి మాదిరిగా

అంగలార్చిందెపుడూ లేదనుకో. యీడేమో తిరణాల జరగతా వున్నట్టు చుట్టుపక్కల పల్లెలనుంచీ గుంపులు గుంపులుగా జనం వొకటే రావాటం. యెంత వానలు పడకపోతే మాత్రం భూమీ బుర్రా పరిగిల దోలేసి, యిట్లామన మీద పడితే న్యాయమేనా? యిక్కడ మాత్రం నీళ్లెక్కడుండాయి? ఆ గాంధీ నగరమోళ్లు రైల్వే కాలనీ నుంచీ నీళ్లు మోస్తా వుండారు. యీడేమైనా కూలీ పన్లు కుప్పబోసుకోనుండారా? యీ మేస్త్రీలకూ, గుమస్తాలకూ యెవుడు యీ వూరోడో, యెవుడు పరాయోడో యిరతం పరతం తెలస్తా వుండాదా? వచ్చినోడంతా రాతి కూసాల మాదిరి బలంగా వున్న వాళ్లనే తోడుక్కోని పోతావుంటే మిగిలినోళ్లేమైపొయ్యేదని? అట్లా చూడు. పెద్ద మిత్తవ మాదిరిగా గోయిందరాజుల గాలి గోపురం యెగజూసుకొనే వుండాది. యీడేమో ధర్మగోవు వొంటికాలి మీదే నడస్తా వుండాది…" తన గోడు వెళ్ల బోసుకున్న తర్వాత నామాలాయన అక్కడినుంచీ పైకి లేచి తన స్థానం వైపు కెళ్లిపోయాడు.

కూడలి దగ్గర చీకటి మెల్లమెల్లగా పలచబారుతోంది. యెర్రని సోడియం వేపర్ దీపం క్షయ రోగిలా పాలిపోయి కనిపిస్తోంది. దొంగల్లా అడుగు పెట్టిన ప్రభాత వాయువులు అప్పుడప్పుడూ మెల్లగా కదులుతున్నాయి. గాలి వీచినప్పుడల్లా దీపం కింద రాలిన పురుగుల రెక్కలు పైకెగురుతున్నాయి. దూరంగా మార్కెట్టు ముందు ఆగిన లారీలోంచీ కూలీలు బుట్టల్ని దింపుతున్నారు. నాలుగు కాళ్ల మండపం దగ్గరికి మెల్లమెల్లగా జనం చేరుకుంటున్నారు.

జానెడు పొడవున్న వేపపుల్లల కట్టలు రెండింటిని చేతబట్టుకుని అద్దాలాయన రంగమ్మ దగ్గరికొచ్చాడు. పాత కాషాయరంగు లుంగీ కట్టుకున్నాడతను. పుల్లలా ముఖానికంటుకున్న వెంట్రుకలు. ఫ్రేము విరిగిన కళ్లజోడును దారంతో చెవులకు కట్టుకుని వున్నాడు. నరాలన్నీ పైకుబికిన కట్టె చేతులతో రెండు వేపపుల్లల్ని రంగమ్మవైపుకు చాపాడతను. వొక పుల్లని రాజీకిస్తూ "చిల్లర లేదు పెద్దాయనా! రేపిస్తాన్లే" అంది రంగమ్మ. ఆమె సమాధానంతో సంబంధమేమీ లేనట్టుగా ముందుకు కదిలిపోయాడు అద్దాలాయన.

వేప పుల్లని కచకచా రెండుసార్లు నమిలి, పైకి లేచి కచేరీ గోడల పక్కన వుమ్మేసి "మనిషంటే అద్దాలాయన మాదిరుండాల" అంది రంగమ్మ. "యింత ముసిలోడయినా యింకో మనిషి రుణంలో పొయ్యే దానికి ఆ ప్రాణం వొప్పుకోదే! యేడేడ తిరగతాడో, యేడ పెరుక్కొస్తాడో యేమో! తెల్లారే కాడికి యిన్ని పళ్లుదోము పుల్లలు తెస్తాడు. దుడ్డిస్తే తీసుకుంటాడు. యీయకపోయినా యేమనడు. రెండు మూడు రూపాయలుంటే దినం గడిపేస్తాడు. యే పొద్దయినా యెవుడిముందరైనా చెయ్యి చాపున్నా?…" రెండు దినాలుగా యీ రాజీ తన మీదే ఆధారపడి వుంది. కాబట్టి యెంతగానో రుణపడి పోయింది. ఆ విషయం ఆమెకింతకన్నా స్పష్టంగా యెలా చెప్పాలో తోచక రంగమ్మ మౌనంగా వుండి పోయింది.

కూడలిలోని నియాన్ లైటు వెలగడం మానేసింది. వీధి దీపాలు కూడా ఆఫయిపోయాయి. చీకటి పూర్తిగా నిష్క్రమించడంతో భళ్లున తెల్లవారిపోయింది. తెరిచిన టీ కొట్టులో బాయ్‌లరు ముందు యెర్రటి బనీను తొడుక్కున్న పయిల్వాను లాంటి వ్యక్తి గ్లాసులు కడుగుతున్నాడు. గుంపులు

గుంపులుగా వస్తున్న జనానికి స్థలమివ్వడం కోసమన్నట్టుగా పశువులు పైకి లేచి యెటో వెళ్తున్నాయి. మురికి కాలువ దగ్గరి పంది పిల్లలెప్పుడు మాయమయ్యాయో తెలియడం లేదు. బొత్తాలూడిన చొక్కాలు, చినిగిన పంచలు, నలిగిన జుబ్బాలు, మాసిన గడ్డాలు, చెదిరిన జుట్టు, వెలిసిపోయిన చీరలు, జిడ్డోడుతున్న ముఖాలు, బీడీల పొగ, చుట్టల కంపు - నాలుగుకాళ్ల మండపం దగ్గర సంరంభం ప్రారంభమైపోయింది.

బాగా పొట్టిదైన పైజామా పైన తనదిగాని చొక్కాని తొడుక్కున్న లావుపాటి పొట్టి వ్యక్తి వొకడు రోడ్డుపైన తచ్చాడుతూ రంగమ్మకు కనిపించాడు.

"మస్తానూ... యిక్కడ... రా రా!" అంటూ అతడిని ఆహ్వానించింది ఆమె.

"యీ పొద్దు నన్ను పిలిచినా గుణం లేదు రంగమ్మా! చిన్నా చితకా పని గాదు. రోడ్డు పని. మునిలీ ముతకా లాభం లేదు..." మాట్లాడుకుంటూ ముందు కొచ్చిన మస్తాను సాహేబు రంగమ్మ పక్కన మరో వ్యక్తి కనిపించడంతో ఆగిపోయి, ఆ వ్యక్తిని పరకాయించి చూడసాగాడు.

రంగమ్మ వంకర నవ్వుని వెదజల్లుతూ "చూస్తే యేమొస్తింది సాయిబన్నా! పని వుంటే చెప్పు. యెన్ని దినాలయినా వొక్రం లేకుండా పనిచేసే పిల్ల" అంది.

మస్తాను సాహేబు రాజీ కేసి కళ్లార్పకుండా చూస్తూ "రోడ్డు పని... కావల్సింది ఆడకూలోళ్లే! వొకరు గాదు యిద్దరు గాదు. ఆరుమంది. గుల్లకొట్టే పని. మా సుబ్బరామ చౌదరికి కాంట్రాక్టొచ్చింది. వూర్లో నాలుగు రోడ్లు మనవే! లారీల్లో గుల్ల తెచ్చి తోలేసినాం... పదిరవై దినాల పని..." అంటూ వో నిమిషం సేపు ఆగిపోయి, "ఆ పక్కనుండే పసిబిడ్డెవురు?" అని ప్రశ్నించాడు.

అతడి ప్రశ్న వినగానే పులిక్కిపడి రాజీ బిడ్డపైన గుడ్డ కప్పింది.

"బిడ్డ తల్లని చూడద్దన్నా! ముక్కుమని మూలగనైనా మూలక్కుండా చీమిడి చీదినంత సులువుగా బిడ్డను కని పక్కన పెట్టిన పిల్ల..."

"బాలింతరాల్ని నా యెదాన తోలేస్తే యెట్ల రంగమ్మా! యెండలో చెయ్యాల్సిన పని. కండ్లు తిరిగి పడిపొయ్యిందంటే ఆస్పత్రి చుట్టూ తిరిగేదానికి నా వల్ల కాదు. యింకో ఆరు నెలలు పోయినాకయితే చెప్పు. బిడ్డ కొంచెం పెద్దదయుంటుంది. తల్లి పనీ పాటా చూసుకోవచ్చు. అప్పుడు పిలువు నన్ను. యేదయినా వొక పనిలో దూర్చేస్తాను. నీకు పని కావాలని అడిగితే అది మాత్రం నా వల్ల గాదు. చిటికేసినంత సేపు పని చేస్తే గంటసేపు రెస్టు కావాలంటావు. పోయిన తడవ మోల్డింగు పని పెట్టుకున్నప్పుడు పొరంబోకు పనోళ్లని పిలచకపోయినానని మా పెద్దాయన కాసర బీసరమన్నాడు."

రంగమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా అక్కడినుంచీ వెళ్లిపోయాడు మస్తాను సాహేబు.

రాజీని మరోసారి శల్యపరీక్ష చేసి చూసింది రంగమ్మ. నేరేడు పండులా నిగనిగలాడుతున్న శరీరం! సన్నగా వున్నా దృఢంగా కనిపిస్తున్న ఆకారం, తీరైన నిమ్నోన్నతాలు - పుట్టినప్పటినుంచీ కాయకష్టాలకూ, పస్తులూ రగడలకూ లోనైన శరీరమే అయినా , వయసు రావడం చేత

పక్వానికొచ్చిన పండులా పేట్రేగిపోతున్న పిల్ల. యిప్పుడే గిరాకీ లేకపోతే యింకెప్పుడుంటుంది? రంగమ్మ కొక్కసారిగా కొండంత ధైర్యం కలిగింది. మూడు రోజుల తన పెట్టుబడి వృథాగా పోదన్న నమ్మకం కలిగింది. "యేయ్ రాజీ! యెంతసేపని ఆ పుల్లను నమలతావు. ఆ పక్క బోరింగు కాడికి పోయి మూతి గడుక్కోని రా పో! నీ ఆసుంటిదానికి పని చూపించలేక పోతానా నేను? యిన్ని సమత్సరాలుగా యెందురెందురికి దోవ చూపించలేదు? నీకేమీ బయమొద్దులే తల్లా! కొంచెం ఆ తల్లో దూబానె పెట్టు. కంటికి నాణ్ణెంగా కూర్చో. మిగిలిందంతా నేను చూసుకుంటాను" అంటూ రాజీకి భరోసా యిచ్చింది.

కూడలి దగ్గర జనసమ్మర్దం పెరిగిపోయింది. పదహైదిరవై యేళ్లనుంచీ యాభై అరవై యేళ్ల వరకూ, రకరకాల వయసున్న రకరకాల వ్యక్తులక్కడ గుమికూడి పోయారు. అక్కడక్కడా కొందరు ఆడవాళ్లు కూడా వున్నారు. నలగ్గొట్టిన తాటిపట్ట నొకదాన్ని పాత డబ్బాలో వేసుకుని, గోడలకు వెల్లవేసే వాళ్లు యెక్కడపడితే అక్కడ కనిపిస్తున్నారు. కూలీలు కావలసినవాళ్లు వచ్చి చూసి, నచ్చిన శాల్తీలను యెన్నిక చేసుకుని, బేరాలు కుదిరితే వెంట బెట్టుకుని వెళ్తున్నారు.

ముఖం కడుక్కున్నాక, రాజీ తల దువ్వుకుంటూ కూర్చుంది.

మాసిన నాలీసు పంచెలు కట్టుకున్న యిద్దరు వ్యక్తులు అద్దాల అంగడి దగ్గరికొచ్చి నిల్చున్నారు. వాళ్ల వొంటిపైన చొక్కాలు లేవు. భుజాలపైన తుండుగుడ్డలు మాత్రం వున్నాయి. మాసిపోయిన గడ్డాలు, జందెం పోగులు వేలాడుతోన్న బక్కచిక్కిన శరీరాలు.

"యేం సామీ! యీ పొద్దు మంచి దినమేనా?" అని అడిగింది రంగమ్మ.

ఆ యిద్దరిలోనూ బాగా ముసలివాడుగా కనిపిస్తున్న వ్యక్తి చివాలున ఆమెవైపుకు తిరిగి నీకిదే శాస్తి అన్నట్టుగా – "అష్టమి – వేలు పెడితే కష్టాలే" అన్నాడు.

రంగమ్మ ముఖం ముడుచుకుని యివతలికి తిరిగి కూచుంది. బ్రాహ్మణు లిద్దరూ మళ్లీ తమ లోకంలోకి వెళ్లిపోయారు.

"నిన్నెక్కడికెళ్లావు? కనిపించనే లేదు" అడుగుతున్నాడు ముసలాయన.

"భవానీ నగర్లో తద్దినం. యింటికాడికే మనుషులొచ్చినారు" అన్నాడు పడుచువాడు.

"పోనీలే, నీ కోసం చాలాసేపు చూశాన్నిన్న – బైరాగిపట్టెడలో తద్దినం – వస్తానన్న బ్రాహ్మణుడు యెగ్గొడితే వెతుక్కుంటూ వచ్చినారు. గ్రాండ్‌గా జరిగిందిలే! యాభై దాకా గిట్టింది" అన్నాడు ముసలాయన.

"నిన్నటి సంగతి సరేలే! యీ పొద్దు సంగతి చూడండి. యింత పెద్ద వూర్లో వొకరిద్దురైనా గుంతకల్లుకు టికెట్లు కొన్లేదా! వ్రతాలూ, ముహూర్తాలూ లేకపోతే పోనీ, తద్దినాలైనా దొరకవా అని ఆశ..." అంటున్నాడు పడుచువాడు.

విన్నంతసేపూ విని, రాజీకి చేరువగా వచ్చి రహస్యం చెబుతున్నట్టుగా స్వరాన్ని తగ్గించి, "వుపాతకం సాములు... శాస్త్రం సరిగ్గా చూసే విద్యే వుంటే యీడికెందుకొస్తారు? పార్టీలు

యింటికాడికే వచ్చి వుండవా? కంత్రీలు... చూసే వాళ్లు యేమారితే, మూటలు మోసేదానికి గూడా రెడీ అయిపోతారు... నాలుగైదేండ్లుగా చూస్తా వుండాన్లే వీళ్లని...” అంటూ సాగదీసింది.

రోడ్డుపైన రాకపోకల సంరంభం బాగా యెక్కువైపోయింది. సైకిళ్లూ, రిక్షాలూ, వ్యాన్లూ, టౌను బస్సులూ రకరకాల శబ్దాలతో అక్కడ చేరిన జన ఘోషకు వాద్య సహకారాన్ని అందించసాగాయి. కూలీలందరూ పార్టీలకోసం యెదురుచూస్తున్నారు. అయిదుమంది ఆడవాళ్లను సమీకరించుకుని మస్తాను సాహేబు సున్నపు వీధి వైపుకు నడుస్తున్నాడు.

“ఆ మస్తాను సాయిబుకెంత ధిమాకో చూసినావా రాజీ! మనమిద్దరమూ పనికిరామంట. ఆ కొత్త నపుర్లు బాగుండాయంట. చేతిలో రెండు రూకలు గలగలమంటా వుంటే మాత్రం మనుషులకింత పెగ్గి పెరిగిపోవాల్నా? వీని బతుకెంతో నాకు తెలవదా? మొన్నటికి మొన్న ఆ కదిరి పక్క మొలకల చెరువుకాడినుంచీ గుడ్డ భుజానేసుకోని, పెళ్లాం బిడ్డలను తోలుకోని ఈ నాలుక్కాళ్ల మండపం కాడికొచ్చినోడే గదా వీడు కూడా! నువ్విప్పుడు కూచ్చోనుండే తావులోనే కూర్చోని గుక్కిళ్లు మింగతా వుంటే దయర్నం చెప్పింది నేనే గదా! ఆ మునిరాంరెడ్డి గాడికి కూడా మనం చెల్లని కాసులై పోయినామా? ఆ జమ్మల మడుగు పక్క కొత్పూరు నుంచీ వచ్చి రిక్షా తొక్కుకుంటా బతికిన దినాలిప్పుడు గవనముండాయా వానికి? లోకమెట్లుండాదో బాగా కండ్లు తెరచి చూసుకోయే రాజీ! వొయెసులో వుండేటప్పుడు యేమారినావంటే నీ బతుకు గూడా నా మాదిరే తెల్లవారితింది...” చెప్పడం ఆపి కాస్సేపు రాజీ ముఖంలోనే చూపును కేంద్రీకరించింది రంగమ్మ. కనురెప్పలు ఆడడం తప్పితే ఆమె ముఖంలో మరో రకమైన చలనమేదీ కనిపించడం లేదు. రంగమ్మ బతుకెలా తెల్లారిందో తెలుసుకోవాలన్న వుత్సుకత సైతం ఆమెలో కనిపించక పోయేసరికి రంగమ్మకు వొళ్లు మండిపోయింది. యిక ముఖం చూడనన్నట్టుగా పక్కకు తిరిగి కూచుంది.

యెప్పుడొచ్చి కూర్చున్నాడో తెలియదుగానీ, ముక్కు ముసలాయన యెదురుగా కనిపించా డామెకు. అతడు తింటున్న ఆహారాన్నంతా తానొక్కతే దోచుకుంటున్నట్టుగా అతడి ముక్కు వికృతంగా పెరిగి వుంది. ముఖంలోని మిగిలిన అవయవాలన్నీ ముక్కును చూడలేక భయంతో ముడుచుకుపోయినట్టు కనిపిస్తున్నాయి. రంగమ్మ తన వైపుకు తిరగగానే అతడు ‘యిహిహి’ అంటూ పళ్లికిలించి, “కొంచెం పొవ్వాక్కట్టె వుంటే యిస్తావా తల్లా?” అంటూ చేయి చాపాడు.

రంగమ్మ తన గుడ్డ సంచిలోంచీ చిన్న పొగాకు కట్టె తీసి అతడికిచ్చింది. పొగాకు రసం గొంతు దిగినతరువాత ముసలాయన అర్ధనిమీలిత నేత్రుడై “పొద్దింత పైకొచ్చింది. యెందింకా రాలేదే! చూసేదానికి మొబ్బు కమ్మినట్టుగా ఉండాది. యీ పొద్దేమైనా వాన కురుసునా?” అంటూ ప్రశ్నించాడు.

రంగమ్మ తూర్పువైపుకు తిరిగి ఆకాశంకేసి చూసింది. నల్లటి మేఘాల గుంపు ఆకాశమంతా కనిపిస్తోంది.

"యీ పాపం చేసుకున్న కొంపలో పనుల్ని పోగొట్టే వానలు మాత్రం పడతానే వుండాయి. యేందో పెద్ద మేలు చేసే మాదిరి పొద్దన్నే రెండు చినుకుల్ని టపటపా రాల్చి, అందర్నీ బెదరగొట్టేసి, పనులాపేయించినాక చక్కా ఎండ దిగొస్తంది" అంటూ గొణుక్కున్న తర్వాత, అంత పనీ జరిగి వర్షం పడితే యీరోజు గడవడమెలాగన్న ప్రశ్న స్ఫురించిందామెకు. యిలాంటి సందేహాన్ని రేకెత్తించిన ముక్కు ముసలాయనకు పొగాకు కట్టె నిచ్చినందుకు తనను తానే తిట్టుకోసాగింది రంగమ్మ.

"యేం రంగమ్మా! యెవురీ కొత్తపిల్ల?"

ప్రశ్న వినిపించిన వైపుకు తిరిగి చూసిందామె.

గళ్లగళ్ల డ్రాయరు కనిపించేలా పంచ పైకెత్తి కట్టుకుంటూ కనిపించాడు మేస్త్రీ కుప్పుస్వామి. జెండా కొయ్యలా సన్నగా వున్న అతని శరీరానికీ, లావుగా పొట్టిగా వున్న అతడి చేతివేళ్లకూ, కాలివేళ్లకూ సామ్యం కుదరడం లేదు.

రంగమ్మ దుమికినట్టుగా లేచి నిల్చుని "రా కుప్పసామీ! పొద్దన్నించీ నీ కోసరమనే కాసుకోని కూచ్చోనుండాను. రాత్రి రెండో ఆట యిడిసి పెట్టేదాంకా రైలుటేషన్లో పండుకోనుంటిమి. నువ్వేడ చెయ్యి దొరక్కపోతావో అని, గూర్కా కట్టె కొట్టుకుంటా పోయినాక యీ చావిడి దగ్గిరికొచ్చి పండుకొంటిమి..." అంది రంగమ్మ.

"నా కోసరమే చూస్తా వుండేదాని మాదిరిగా మెరమెచ్చుల మాటలు చెప్పొద్దు. నీకు యెవ్వరైనా కొత్తోళ్లు తగిలినప్పుడు ముందుగా కనబడే మనుషులు వేరే వుంటారని నాకు తెలుసు. అందరూ వద్దన్నాక కడబడినోళ్లుంటే అప్పుడు కదా నేను నీకు కనబడేది..." అన్నాడు కుప్పుస్వామి.

"నువ్వెందుకట్ల మాట్లాడతా వుండావో నాకు తెలుసులే కుప్పసామీ! ఆ రహమత్ బీని తొలీగా చూపించలేదనే నీకు కోపం. ఆకాడికీ నీ కోసరమని మణీగాడినుంచీ మూడు దినాలు తప్పించుకోని తిరిగినాను. నువ్వెప్పుడైనా టయానికి కనపడితే గదా! అయినా జరిగిపోయిన కతంతా యిప్పుడెందుకు? యిప్పుడు జరిగేదేమైనా వుంటే చెప్పు...."

"చెప్పేదానికేముండాది? డీలక్స్ థియేటరుకాడ ప్లాట్లు కడతా వుండాము. ఆరేడు నెలల పని. చాలామంది కూలోళ్లుగావాల్ల. నువ్వేమో భారీ పనులకు పనికిరావు. యిదేమో పసిబిడ్డ తల్లి..." అంటూ ముందుకడుగేసి "యీ పిల్లకేమైనా మాటలు రావా? యేం పిల్లా, నీ పేరేంది?" అని అడిగాడు అతను.

రంగమ్మ అతడికీ, రాజీకీ మధ్యలోకొచ్చి నిల్చుంటూ "బంగారంగా మాటలొచ్చు. ముందు పనిస్తావో లేదో అది తేల్చు" అంది.

కుప్పుస్వామి కళ్లెగరేసి అదోలా నవ్వుతూ "ఆత్రం వద్దు. ముందు కొంచెం నదురుగా వుండేటోళ్లని పనిలోకి చేర్చుకోనీ. సందు జూసి మిమ్మల్ని గూడా దూర్చేస్తాను. మళ్లా వస్తాలే!" అంటూ వెళ్లి జనంలో కలిసిపోయాడు.

మేఘాల్ని చీల్చుకుని బయటపడ్డ మొదటి సూర్య కిరణం నాలుగు కాళ్ల మండపం దగ్గర తెరపలు తెరపలుగా యెండని సరఫరా చేసింది. రోడ్డు పక్కనున్న అంగళ్లన్నీ తెరిచేశారు. సాంబ్రాణి పళ్లెరాన్ని చేతబట్టుకున్న ఫకీరు అంగళ్లన్నీ పరామర్శించి వస్తున్నాడు. యింకా డ్యూటీ యెక్కని ట్రాఫిక్ పోలీసు టీ కొట్టు ముందు నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు.

నీలి రంగు స్కూటరొకటి ముక్కు ముసలాయన ముందుకొచ్చి ఆగింది. స్కూటర్ ఆఫ్ చేసి, అలాగే సీటుపైన కూర్చుని వో కాలు నేలపైన ఆనించి, తారుడ్రమ్ములాంటి ఆకారమున్న వ్యక్తి, చుట్టూ నిల్చున్న మనుషుల్ని పరిశీలించి చూడసాగాడు.

"యేం పని సార్?" అని అడిగాడు ముక్కు ముసలాయన.

ఆగంతకుడు అతనివైపుకైనా చూడకుండా "నువ్వు పనికిరావులే" అని, అద్దాలంగడి ముందున్న బేల్‌దారీ బక్కాయనను యిలా రమ్మంటూ కేకేశాడు.

"సున్నం గొట్టే పని, యీ అద్దాలంగడి అంత యిల్లు. రెండు అంతస్తులు. రెండు దినాల్లో పని ముగించెయ్యాల. యింకో మనిషిని కావాలంటే పిలుచుకో..."

"యితరా మనుషులొద్దు సార్. నేనూ, నా కొడుకూ, మా ఆడోళ్లూ వస్తాం. రెండు దినాల్లో ముగించేస్తాం" అన్నాడు బక్కాయన.

"మీ సంసారాన్నంతా తోలుకొస్తే నేనొప్పుకోను. వాడేనా నీ కొడుకు? ఆ చేతులు చూడు. పుల్లల మాదిరుండాయి. కాళ్లు చూడు. గొల్లభామ పురుగు మాదిరుండాడు. వాడేం పని చేస్తాడు. వేరే యింకెవ్వరైనా బలంగా వుండే మనిషిని తోడుక్కోని వచ్చేటట్టయితే రా! లేకపోతే వద్దు. అన్నం పెట్టి దినానికి ముప్పయ్యి యిస్తాను. రాంనగర్ పోస్టాఫీసు పక్కనే యిల్లు..."

"నలభై అయినా యియ్యండి సార్. సున్నంతో పని... వొళ్లు తినేస్తాది..."

"అదే వద్దనింది. బేరం గీరం వొప్పుకోను. కడా మాట. ముప్పయ్యి అయిదు. యిష్టమా? కష్టమా?..."

బేల్‌దారీ బక్కాయన పాత డబ్బానూ, తాటిపట్టనూ చేతికెత్తుకుని "పద సార్. వస్తా వుండాం" అన్నాడు.

స్కూటర్ ముందుకు దౌడు తీసింది.

"యీడనే కూర్చోనుండే రాజీ! ఆ కుప్పసామెట్ల పొయినాడో చూసుకోనొస్తాను" అంటూ రంగమ్మ అక్కడినుంచీ బయల్దేరింది.

నాలుగురోడ్ల కూడలిలో యెర్రరంగు బోర్డు చేతబట్టుకుని ట్రాఫిక్ పోలీసు విన్యాసాలు ప్రారంభించేశాడు. బైరాగి పట్టెడలో యిల్లు మోల్డింగ్ పని కోసం మేస్త్రీ వొకతను కూలీలతో బేరం సాగిస్తున్నాడు. చూడగానే ఆఫీసరు కొడుకులా కనిపిస్తున్న యువకుడొకడు వాళ్లింటి చుట్టూ అడవిలా పెరిగిన పిచ్చి మొక్కల్ని నరికి చదరం చేయగల భుజ బలశాలి కోసం వెతుకుతున్నాడు. డబ్బాలనూ తాటి పట్టలనూ నేలపైన పెట్టి, చుట్టూ కూర్చున్న అయిదారు మంది నడివయసు

మగవాళ్లు, బీడీ పొగలతో పార్టీల ఆగమనం కోసం ఆవాహన చేస్తున్నట్టు కనిపిస్తున్నారు. బాగా గడ్డం పెరిగిన బక్కపలచని వ్యక్తి శ్మశానంలో గొయ్యి తవ్వే మనుషులెవరైనా దొరుకుతారా అని విచారిస్తున్నాడు. నోళ్లనిండా వక్కాకు దట్టించిన ఆడవాళ్లగుంపు వెదురుబుట్టలనీ, పాత తలగుడ్డలనీ సర్దుకుంటున్నారు. హనుమంతుడి గుడికి వుత్తరపు వైపున వరుసగా నిల్చున్న మగవాళ్లు దారినపోయే వ్యక్తినల్లా పార్టీ యేమోనని తరిచి చూస్తున్నారు. బోరింగు పంపు దగ్గర ఖాళీ అయిపోయిన టీగుండా కడుగుతున్నాడు దయాళ్.

బోరింగు పంపు కటువైపున కూలీలతో మంతనాలాడుతూ కనిపించాడు కుప్పుస్వామి. వాళ్ల దగ్గరినుంచీ వైదొలగి రంగమ్మతో మాట్లాడడానికి అరగంట పట్టింది అతడికి. అనవసరపు విషయాలను మాట్లాడడానికి తీరిక లేదన్నట్టుగా "యిప్పుడు చెప్పు, యెవురా పిల్ల?" అని ప్రశ్నించాడు కుప్పుస్వామి.

"చూసినావు గదా! మంచి వయసులో వుండే పిల్ల. యాడేడ కండ పట్టి వుంటే బాగుంటాదో దాన్ని చూసే తెలుసుకోవాల. వారం దినాలు కొంచెం చూసీ చూడనట్టుగా వున్నావనుకో, మల్లంక దాని కష్టంపైనే బతికిపోతంది. యింకొకరి కష్టంపైన బతికే జన్మం గాదు..."

"ఆ సంగతులు కాదు. యేవూరినుంచి వచ్చింది? యెందుకొచ్చింది? మొగుడుండాడా? యెట్లాంటి కేసు? పోలీసోళ్లు యెతుక్కుంటా వస్తే నా గతేమయ్యేట్టు?.."

"అయ్యయ్యో! అట్లాంటి పిల్లను నీ దగ్గరికి తొడుక్కొస్తానా నేను? యీ రాజీ వుండాదే, అది లోమనిషి, యిట్లా అని నోరు యిప్పి చెప్పలేదనుకో. కానీ, నేను వొదిలిపెట్టకుండా కాళ్లావేళ్లాబడి కొన్ని సంగతులు తెలుసుకుంటిని. వచ్చిందేమో పడమటి పక్కనుంచి... బురకాయలకోట పక్కనేదో వూరు. వాళ్లకుటుంబరమంతా అందురి మాదిరే వానల్లేకుండా పైర్లెండబెట్టుకునే తావునించే యీ వూరికొచ్చినారు. ఆడా యీడా పని చేసుకుంటా వుండంగానే ఆడెవుడో దీనికి తగిలినాడు. నమ్మింది. వానికంతకుముందే పెండ్లి పెటాకులూ జరిగినాయని తెలిసింది. తల్లీదండ్రీ తన్ని తరిమేసినారు. యింకో దోవ లేక ఆ మొగోడినే నమ్ముకొనింది. తీరా తీర్థమాడినాక ఆస్పత్రిలో దొంగల్దోలేసి వాడు యీ వూరినుంచే మకామెత్తేసినాడు. యేదయినా వొక దోవ చూపిస్తే పుణ్యమైనా వస్తాదని నేను పాకులాడతా వుండాను..."

కుప్పుస్వామి ముందుకు నడుస్తూ "యేమో రంగమ్మా! నీ మాటలు వింటా వుంటే అయ్యో పాపమనే వుండాది. కానీ నెలల తరబడీ బాలింతరాల్ని కూచ్చోబెట్టి పోషణ జేసే శక్తి నాకు లేదు" అన్నాడు.

యిద్దరూ రాజీ కూర్చున్న చోటుకొచ్చారు.

కుప్పుస్వామి రాజీవైపుకైనా చూడకుండా బేల్దారీ బక్కాయన పెళ్లాన్ని కేకేసి "యిల్లు కట్టే పని. వొళ్లు దగ్గిర పెట్టుకోని బయింగా పనిచేస్తే నాలుగు నెలలు ఆడనే వుండొచ్చు..." అని ముక్తసరిగా కొటేషను వివరించాడు.

నాసిరకం రబ్బరు బొమ్మలా కనిపిస్తున్న బక్కాయన పెళ్లాం తెచ్చిపెట్టుకున్న వుత్సాహంతో "మా యింటాయిన బేల్దారీ పనిలో పడి లేచినోడు. కొంచెం ముందు రాకపోతివి గదన్నా! యెవురో సున్నం కొట్టేదానికి మనిషి కావాలని తోడుక్కోని పోయినారు. యింటి పనంటే మా కొకరు చెప్పాల్సిన పనే లేదు. నాకూ, నా కొడుక్కూ ఆ పనంటేనే ప్రాణం లేచొస్తుంది..." అంది.

"సరే పద. అందురూ రైల్వేస్టేషను గేటు ముందుకు చేరండి. చానా దినాల పని. కూలీ ఆట్నో యిట్నో చూసుకోని యిస్తాను..."

కుప్పుస్వామి ముందుకు పరిగెత్తుకొచ్చి "మా సంగతి అయిసా పయిసా తేల్చనే లేదు" అంది రంగమ్మ.

"వుండు రంగమ్మా! లేడికి లేచిందే పరుగంటేయెట్ల? నన్ను కొంచెం గుక్క తిప్పుకోనీ" అంటూ వెళ్లిపోయాడు కుప్పుస్వామి.

యెండ బాగా యెక్కువ పడటంతో కచేరీ ముందు మూరెడు పొడవు నీడ మాత్రమే మిగిలి వుంది. ఆ నీడలోనే ముడుక్కుని కూర్చుంది రాజీ. ఆమె వొడిలోని బిడ్డ పాలు తాగుతూనే వుంది. ముఖంపైన పడుతున్న యెండకడ్డంగా అరచేయి అడ్డుపెట్టుకుని ముక్కు ముసలాయన కూర్చుని వున్నాడు. పార్టీలతో బేరాలు కుదిరించుకున్న కూలీలు తమ తమ గమ్యాల కేసి సాగిపోతున్నారు. టౌను బస్సుల కోసం యెదురుచూసే మధ్యతరగతి మనుషుల సంరంభం పెరగసాగింది. అంగళ్లలో బేరసారాలు వూపందుకున్నాయి. యిస్త్రీ మడతలు నలగని బట్టలతో తిరిగే మనుషుల శాతం పెరగసాగింది. మధ్యమధ్య అక్కడక్కడా ఇంకా పనుల కోసం యెదురుచూస్తున్న కూలీలు యెరువు అందని ప్రదేశాల్లో సక్రమంగా పెరగని పైరు మల్లే వెలవెలబోతూ కనిపిస్తున్నారు.

తానూ వెళ్లి అద్దాల అంగడి పక్కన మిగిలిన జానెడు నీడలో కుదించుకుని కూర్చున్న తరువాత "వుపాతకం మొగోడు.... గుక్క తిప్పుకోవాలంట. యేంది వీడు ఆలోచన చేసేది? ముండమోపి. ముండాకొడుకు... మొగాన మీసాలుంటే సరా?" అని నోటికొచ్చిన తిట్లు తిట్టసాగింది రంగమ్మ.

రాజీ ముఖమైనా ఆవిడకేసి తిప్పలేదు. ముక్కు ముసలాయన కచేరీ పక్కన గోడకుర్చీ వేస్తున్నాడు.

యెవరు వినకపోయినా పర్వాలేదన్నట్టుగా స్వగతంగా గొణుక్కోసాగింది రంగమ్మ. "యివరాలనేవి యీ ముచ్చు మొగానికి వక్కాకు పెట్టి చెప్పాల్నా? పుట్టిన వూర్నీ, అయినోళ్లనూ వొదిలిపెట్టి వీడీ టౌనుకెందుకొచ్చినాడో గవనంలో పెట్టుకున్నాడా అని? యినేదానికి రంజుగా ఉండేట్టుగా కావమ్మ కథో, శరాబందిరాజు కథో చెప్పాల్నా వీని మొగానికి? పైగుడ్డ భుజానేసుకోని, కడుపు చేత్తో పట్టుకోని వూరుగాని వూరికొచ్చినోళ్లకు యివరాలెక్కడనుంచీ తెచ్చిపెట్టేది నేను? వానికి మాదిరిగా నాకు సరిగ్గా రాత రాయలేదు కాబట్టి, మా వోళ్లంతా తలా వొక దిక్కుకు పల్లాకుల పాలైనారు కాబట్టి యిట్లా నేను అగోరిస్తా వుండానని చెప్పాల్నా? నా రాతా, యీ పిల్ల రాతా వొకటేరా అంటే అర్థంగాదే యెదవనాయాలుకు! సాక్షికం చెప్పేదానికి కట్టుకున్నోడ్నీ, కన్నోళ్లనూ యెక్కడినుంచీ తెచ్చేది నేను?"

నాలుగుకాళ్ల మండపం దగ్గర మిగిలిన కూలీలు పనులు దొరకవని నిర్ణయించేసుకున్నారు. పెన్నిధిలా దాచిపెట్టిన పాత గోతాల్ని భుజాన వేసుకుని కొందరు పాత కాగితాల కోసమూ, పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువుల కోసమూ దిబ్బల్నీ, మురికి కాలవలనీ గాలించుతూ వూరిలోకెళ్లి పోయారు. యిద్దరు ముగ్గురు ముసలి కూలీలు పాత యినప పెనాలతో మురికి కాలవలలోని యిసుకను గాలించి లోహాల్ని వెలికి తీయడం కోసం పయనమై పోయారు. ముక్కు ముసలాయన జేబులోని చిల్లర డబ్బుల్ని లెక్కపెట్టుకున్న తర్వాత, పాత చెప్పుల్ని కొంటానని ప్రకటించుకుంటూ బయల్దేరేశాడు. నామాలాయన కావడి భుజానికెత్తుకుని హరోంహరమని భిక్షాటనకు పూనుకున్నాడు.

యింతలో బేల్‌దారీ బక్కాయన పెళ్లాం పనేదో మరచిపోయి వెళ్లిన దానిమల్లే నాలుగుకాళ్ల మండపం దగ్గరికొచ్చింది.

“యేం వదినా? కుప్పసామి నిన్నుగూడా దొంగల్లోలేసినాడా?” అంది రంగమ్మ

బక్కాయన పెళ్లాం రంగమ్మకేమీ సమాధానం చెప్పకుండా రాజీ దగ్గరికెళ్లి పక్కనే కూర్చుంది. రంగమ్మ కళ్లు పెద్దవి చేసుకుని సంగతేమో తెలుసుకోవడం కోసం చెవులు రిక్కించింది. బక్కాయన పెళ్లాం రాజీ చెవుల్లో గుసగుసలాడింది.

యేదో జరగబోతోందన్న విషయాన్ని రంగమ్మ పసిగట్టేసింది. పైకి లేచి “వాసే నా సవితీ! అక్కడ గుణగుణలేందే? చెప్పు, ఆ మేస్త్రీగాడు యేం చెప్పంపినాడు నీతో? ధయిర్నం వుంటే నాతో చెప్పే ముందు?” అంటూ రొప్పసాగింది.

నీతో నాకు పనేమి లెమ్మన్నట్టుగా బక్కాయన పెళ్లాం తాపీగా తన హితబోధను పూర్తిగావించి పైకి లేచి నిల్చుంది.

రంగమ్మ కోపంగా బక్కాయన పెళ్లాం చేతులు గట్టిగా పట్టుకుని “చెప్పే దొంగ ముఖం దానా! యేం వర్తమానం మోసుకొచ్చినావే బేవర్సా?” అంటూ వూపి పారేసింది.

బక్కాయన పెళ్లాం విసురుగా రంగమ్మనోసారి వెనక్కు తోసింది. మొదలు నరికిన మానులా రంగమ్మ వెనక్కు విసురుకుపోయింది. “నీకు చెప్పేదానికి నాకు బయమేందే లంఖిణీ! నీ గుంతనక్క బుద్ధి నాకు తెలవదా? యెట్లయినా యీ బిడ్డను పనిలో పెట్టి, దాని ప్రాపకంలో ఆడుండే పుల్ల యీడెయ్యకుండా బతకాలనీ నీ యెత్తు. యింకో మనిషి కష్టంపైన బతకాలంటే యెవుడొప్పు కుంటాడే బాడ్‌కోవ్. వొంటిగా, నిన్ను దొంగల్లోలేసి, పనిలోకి వచ్చేటట్టయితే రమ్మనమని మేస్త్రీ రాజీకి చెప్పమన్నాడు. యీ పిల్ల కొంగు పట్టుకోని నువ్వా పక్కకు అడుగు పెట్టినావంటే నీ మక్కెలిరించేస్తానని నీకు చెప్పమన్నాడు. ఆ సంగతి గవనంలో బెట్టుకో నువ్వు” చెబుతూనే బక్కాయన పెళ్లాం రైల్వేస్టేషను వైపుకు పరుగే నడకగా దూసుకెళ్లిపోయింది.

రంగమ్మ పైకి లేచి చేతులోసారి తిప్పి చూసుకుంది. మోచేతులపైన రక్తపు డాగులు కనిపించాయి. “రాక్షసి ముండ. యెంత పని చేసిందో చూసినావా రాజీ! మూడు దినాలుగా కన్నబిడ్డ మాదిరిగా కాపెట్టుకోనుండానే నిన్ను. మనిద్దరి మధ్య కొరివి పెట్టాలని చూసిందే బక్కాయన పెండ్లాం. న్యాయమేనా? కాకిపిల్లలకు పెట్టినట్టుగా నా తిండి నీకు పెట్టి కాపాడినానే నిన్ను.

నువ్వా సంగతి మరిచిపోతావని మేస్త్రీ ముండాకొడుకనుకుంటా వుండాడు. ఆ మాయదారి దాని మాట వినద్దు నువ్వు..." రాజీ ధోరణెలా వుందో తెలుసుకోవడం కోసం రంగమ్మ ఆగింది. తాను మట్టిలో పడి దొర్లుతున్నా పట్టించు కోకుండా, రాయిలా కూర్చున్న రాజీ పైన చెప్పలేనంత కోపం వచ్చిందామెకు. పళ్లు పటపట లాడిస్తూ కోపాన్ని అణచుకొని, "నువ్వేమీ బయపడద్దు తల్లా" అంటూ మళ్లీ మొదలుపెట్టింది ఆమె. "ఆ పోరంబోకు మేస్త్రీగాడు కాదంటే మనకు పొయిందేమీ లేదు. అందరూ యీ మాదిరి మిడిమాళం మనుషులే వుంటారా? నువ్వట్లు కుచ్చోనుండు. మిగిలిన కతంతా నేను చూసుకుంటాను. నన్ను నమ్మి చెడిన మనిషి యీ యిలాకాలో లేదు. మేలు చేసినోళ్లను మరవద్దు. దేవుడు నీకు మేలు చేస్తాడు."

పాపాయిని పాతగుడ్డలతో బాటూ వొళ్లోకెత్తుకుని, రాజీ పైకి లేచి రెండడుగులు ముందుకు వేసింది. రంగమ్మ కంగారుగా పైకి లేచి రాజీ భుజాన్ని గట్టిగా పట్టుకొంది. "ఆ పాపిష్టిముండ మాటలు నమ్మద్దు రాజీ! వాని సంగతి నీకు తెలవదు. చూసేదానికి అట్లా కనబడతాడు గానీ, వాడు పెద్ద కిలాడీ. వాని దెబ్బకు తాళలేక పెండ్లామే యెవుడితోనో లేచిపోయింది. వాన్ని నమ్ముకున్నోళ్లంతా అర్థాంతరంలోనే గంగలో కలిసిపోయినారు. ఆ పక్కకు పోయినావంటే నిన్ను కాపెట్టుకోనుండే దిక్కుండరు. నేనాపక్కకు రాను. ఆ కసాయోడు చెప్పిన మాట యినలేదని కన్న తల్లినే సదుగులించేసినాడని అందరూ చెప్పుకుంటా వుంటే యిన్నాన్నేను..." కాస్సేపు మెల్లగా పెనుగులాడిన తరువాత, విసుగ్గా కుడిచేత్తో రంగమ్మను వెనక్కుతోసింది రాజీ. ఆమె కచేరీ గోడ పైకి విసురుకుపోయి పడింది. రాజీ తిరిగయినా చూడకుండా రైల్వేస్టేషను వైపుకు విసవిసా నడచిపోసాగింది.

"పోపోయే కంతిరీముండా! నా దుడ్డు తిని నాకే టోకరా యిస్తే నిన్ను పైనుండేవాడు వూరికే వొదిలిపెట్టడు. నా రుణంలోనే పోతావు. ఆ మేస్త్రీ ముండాకొడుకు సున్నంలోకి యెమిక లేకుండా యిరిచి పారేస్తే అప్పుడు నెత్తీ నోరూ కొట్టుకో! నన్ను నట్టేట్లో ముంచేసి పోయినట్టుగాదు. నువ్వెట్ల బతికి బట్టకడతావో అదీ చూస్తాను. ధూమొచ్చి నిన్నూ నీ బిడ్డనూ యెత్తుకోని పోకపోతే అప్పుడడుగు... నా వుసురు వూరికే పోదు..."

కడుపులో రగులుతున్న ఆకలి వొకవైపు. రాజీ వదిలిపెట్టి వెళ్లడంతో కలిగిన బాధ మరోవైపు ఆమెకు శరీరమంతా మండుతున్నట్టుగా తోచింది. కళ్లల్లో నీళ్లు తిరగసాగాయి. పెదవులు వణకసాగాయి. నాలుగుకాళ్ల మండపం దగ్గర కూలీలెవరూ లేరు. రంగమ్మకు గోడు వినే నాథుడెవడూ కనిపించలేదు.

కూడలిలో యెర్రబోర్డు పట్టుకుని నిల్చున్న పోలీసు ఆ క్షణంలో ఆపద్బాంధవుడిలా కనిపించాడామెకు. నాలుగు వైపులా దూసుకెళ్తున్న వాహనాల మధ్యలోంచీ పడుతూ లేస్తూ పోలీసు దగ్గరికి పరుగెత్తింది ఆమె. "చూడు సా! నా దుడ్డు తినేసి చక్కా పోతా వుంది. నా దుడ్డు యిచ్చేసి యెట్లయినా పొమ్మను. నా దుడ్డు నాకిమ్మను సా!" అంటూ అతడి కాళ్లు రెండూ వాటేసుకుంది.

చేస్తున్న పనిని కాస్సేపు ఆపి, ఆమె చేతుల్లోంచీ తన కాళ్లను దూరంగా లాక్కోవడానికి ప్రయత్నించాడు పోలీసు. అతను సిగ్నల్ చూపెట్టకపోవడంతో బస్సులూ కార్లూ కొంప మునిగిపోయినట్టుగా హారన్లు మోగించసాగాయి.

కోపంతో పోలీసు యెర్రరంగు బోర్డుతో రంగమ్మ నెత్తిపైన రెండు తగిలించి రోడ్డుపైన్నుంచీ వొక తోపు తోశాడు.

ఆమె మురికికాలువ గట్టుపైన మూటలా పడింది. శరీరమంతా బురద గొట్టుకుపోయింది. తల దిమ్మ తిరిగిపోయింది. భయంతో వణికిపోతూ బైర్లు కమ్మడానికి సిద్ధంగా వున్న కళ్లతో చుట్టూ తిరిగి చూసింది.

కచేరీ ముందు కాలేజీ అమ్మాయిల గుంపు టౌను బస్సు కోసం ఎదురుచూస్తోంది. ట్రాఫిక్ పోలీసు వినయంగా బోర్డు చూపెడుతుండగా యెర్రరంగు మారుతీకారు ఠీవిగా ముందుకు పరిగెడుతోంది. ఒకదాని వెంట ఒకటిగా టౌను బస్సులు కవాతు చేస్తున్నాయి. ఆఫీసుకెళ్ళే ఉద్యోగులతో రోడ్డు కిక్కిరిసి పోయివుంది.

మూడు గంటలక్రితం రంగు వెలిసిన నీటి రంగుల చిత్రంలా వెలవెలబోయిన ఆ దృశ్యం ఇప్పుడు ఆయిల్ పెయింటింగ్‌లా మెరిసిపోతోంది. ఆ వర్ణచిత్రంలో దిష్టి బొమ్మలాంటి తనకు స్థానంలేదని రంగమ్మకు అర్థమైపోయింది.

కాళ్ళెక్కడికి తీసుకెళ్తున్నాయో తెలియకపోయినా, అసురుసురని గసలు బోసుకొంటూ నాలుగుకాళ్ళ మండపం దగ్గర నుంచీ వీలైనంత దూరంగా పారిపోవడం కోసం పడుతూ లేస్తూ పరుగే నడకగా సాగిపోయింది రంగమ్మ.

ఇండియాటుడే, 6-20 ఏప్రిల్ 1993